క్లుప్తంగా

వార్డు సచివాలయాల ఆకస్మిక తనిఖీ



గుడివాడ టౌన్: పట్టణంలోని 8, 10, 11 వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి నిలిచిపోయిన దరఖాస్తులను చూశారు. తక్షణ పరిష్కారానికి కావలసిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏమైనా సమస్యలు పెండింగ్‌లో ఉంటే వాటిని తమ దృష్టికి తెస్తే ఉన్నత అధికారులతో పరిష్కార దిశగా ప్రయత్నిస్తామన్నారు. ఉద్యోగులు నిబంధనలు పాటించకున్నా, సకాలంలో స్పందించకున్నా పరిణామాలు తప్పవని హెచ్చరించారు. 'జగనన్నకి చెప్పుకుందాం' కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు.

బాధిత కుటుంబానికి సాయం



పాలంకిపాడు(మొవ్వ): ఇటీవల మొవ్వ మండలం పాలంకిపాడు గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇస్మాయిల్ కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మొవ్వ శాఖ సభ్యులు బుధవారం చేయూతనిఅందించారు. వంట సామగ్రి, బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ చేతుల మీదగా అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఈడే రామకృష్ణ రూ.3 వేలు, ఎనాజిక్ కంగన్ వాటర్ సంస్థ రూ.2 వేలను సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కృష్ణా జిల్లా శాఖ ఎంసీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, కోనేరు రాజేంద్రప్రసాద్, జొన్నలగడ్డ హనుమకుమార్, గొరిపర్తి వెంకటరమణ, దోనేపూడి శివయ్య, మద్దాల కామేశ్వరరావు, వీఆర్వో కే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను పరిశీలించిన ఎంపీపీ

నిమ్మకూరు(పామర్రు): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల మస్టర్లను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలని రాని వారికి హాజరు వేస్తే వారిపై తగు విధమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట బోదె పూడిక తీత పనులను నాణ్యంగా రైతులకు ఏవిధమైన ఇబ్బందుల లేకుండా చేయాలని అన్నారు. బోదుల ద్వారా సాగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా తవ్వకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పొలురాజు, ఫీల్డు అసిస్టెంట్ ప్రసాద్, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం

మండవల్లి: మండలంలోని లింగాల శ్రీ గంగా విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారిని అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. కాశీ ప్రసాద్‌శర్మ యాజ్ఞీకత్వంలో వైభవంగా నిర్వహించారు. 4న రాత్రి 8 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, 5న గ్రామోత్సవం నిర్వహిస్తామని కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ రాజులపాటి యశోధనరావు పాల్గొన్నారు.

విశ్వదాత అవార్డుల ప్రదానం



పామర్రు: మండలంలోని ఎలకుర్రు గ్రామంలో ఉన్న భ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి వారి కళావేదికపై విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవ సభ బుధవారం రాత్రి జరిగింది. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమర యోధుడు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు సమాజానికి చేసిన సేవలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన కవి డాక్టర్ శ్రీరాధశ్రీ, విజయవాడకు చెందిన జర్నలిస్టు చెన్నాప్రగడ వెంకట నాగ సత్యనారాయణ శర్మ, విజయవాడకు చెందిన కథా రచయిత పొన్నాడ సత్యప్రకాశరావు, మచిలీపట్నానికి చెందిన సంఘ సేవకుడు బి.కిరణ్‌పాల్, హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నాట్యాచార్యుడు సుమర్తి వేంకటేశ్వరశర్మకు అవార్డులు అందజేశారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జి.వి.పూర్ణచందు, విశ్వదాత కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు ,ముదిగొండ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- వర్షాలకు తడిసిన మొక్కజొన్న పంట పరిశీలన

పామర్రు(తోట్లవల్లూరు): అకాలవర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతన్నలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. వర్షాల కారణంగా మండలంలోని వల్లూరుపాలెం, రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంకలో బుధవారం ఆయన పర్యటించారు. అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న, పసుపు పంటలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,200 ఎకరాల్లో మొక్కజొన్న పంట కోత పూర్తి అయిందని, మరో 800 ఎకరాల్లో పైరు కోయాల్సి ఉందని అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. కోత కోయని మొక్కజొన్న, పసుపు పంటలకు కూడా ఎన్యుమరేషన్ చేసే విధంగా కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును ఆదుకునేందుకు అవసరమైతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తామని తెలిపారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ఇది రైతు ప్రభుత్వమని చెప్పారు. గతంలో కూడా పంటలు దెబ్బతిన్న సందర్భాల్లో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం సకాలంలో అందించిందన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఎంపీడీవో స్వర్ణలత, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారి చందూ జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



వల్లూరుపాలెంలో తడిసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కృష్ణా జిల్లా వ్యవసాయ అధికారి విజయభారతి

పంట నష్టంపై పారదర్శకంగా నివేదిక

పామర్రు(తోట్లవల్లూరు): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్నపై నష్టం వివరాలను పారదర్శకంగా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని కృష్ణా జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయభారతి అన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం, రొయ్యూరు గ్రామాల్లో అకాల వర్షాలకు తడిసిన పొలాలను బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న కల్లాల్లో ఉన్న రాసులు, మొక్క జొన్న కండెలను చూశారు. పంట నష్ట పోయిన రైతులతో మాట్లాడామని వారి నుంచి వివరాలను తెలుసుకున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని పంపించి పంట నష్టం వివరాల జాబితాలను పారదర్శకంగా తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంట ఉప సంచాలకుడు వైవీఎస్ మోహార్, పామర్రు వ్యవసాయ సహాయ సంచాలకుడు బి.స్వర్ణలత, తోట్లవల్లూరు మండల వ్యవసాయ అధికారి జి. నాగేశ్వరరావు, సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు డి.నరేష్, వి. రమణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభం

పామర్రు: సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన చేస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. పామర్రులో రూ.34 లక్షలతో నిర్మించిన మూడు సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం తాగునీటి సరఫరాకు పంచాయతీ నిధులు రూ.3 లక్షలతో సమకూర్చిన మరో వాటర్ ట్యాంకర్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులు రూ.25 లక్షలతో స్థానిక విష్ణాలయం వద్ద నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు, పంచాయతీ జనరల్ ఫండ్ నుంచి కొత్త పేట వద్ద రహదారి ఏర్పాటుకు రూ.4 లక్షలు, ఎస్.నాగిరెడ్డి ఇంటి వద్ద రూ.5 లక్షలతో సీసీ రహదార్లు నిర్మించామన్నారు. గ్రామాల్లో పాడైన అంతర్గత రహదార్లను అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, సర్పంచ్ కేతావతు కస్తూరి, ఎస్సీ సెల్ నాయకులు మద్దుల సుబ్రమణ్యం, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, పీఆర్ డీఈ శ్రీనివాస్, పీఆర్ ఏఈ ధర్మయ్య, పంచాయతీ ఈవో అబ్దుల్ సలీం, వార్డు మెంబర్లు కూసం సుబ్బారెడ్డి, నందిపాటి కనకదుర్గ, ఎస్ శ్రీలక్ష్మి, పార్టీ నాయకులు కొచ్చెర్ల శ్రీనివాసరావు, డీడీ ప్రసాద్, కె.రాణి, కూసం పెద వెంకటరెడ్డి, నవుడు సింహాచలం, నందిపాటి సాంబిరెడ్డి, బొంతు శశిధరరెడ్డి, మోరా వెంకటరెడ్డి, ఎస్ శివశంకర్‌రెడ్డి, ఎస్ సురేష్‌రెడ్డి, బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, దేవిరెడ్డి సోమిరెడ్డి, కొల్లి చలమారెడ్డి, కలకోటి శ్రీనివాసరెడ్డి, వల్లభనేని బుల్లిబాబు, చిగురుపాటి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పక్కన అధికారులు, నేతలు

వలంటీర్ల వ్యవస్థ ఆదర్శనీయం

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో కైకలూరు మండలంలో కొట్టాడ, ఆలపాడు, పందిరిపల్లిగూడెం, రాచపట్నం, కైకలూరు గ్రామాలకు చెందిన ఏడుగురికి వలంటీర్ నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ పూర్వం గ్రామాల నుంచి ప్రజలు వివిధ ధ్రువీకరణ పత్రాలకు మండల కేంద్రాలకు రావాల్సివచ్చేదని, సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి రావడంతో గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచ్‌లు మంగారావు, జయమంగళ కాసులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ అడవి కృష్ణ, నాయకులు

భక్తిశ్రద్ధలతో వార్షిక బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కైకలూరు భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన, పంచామృతాభిషేకాలను అర్చకులు నిర్వహించారు. స్వామివారిని పెండ్లికొడుకు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. మొదటి రోజు నిర్వహించిన సుదర్శన హోమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) దంపతులు పాల్గొన్నారు. విశిష్ట అతిథిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. సాయంత్రం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొప్పన శివకుమార్, ఆలయ ఈఓ వీఎస్‌కే శేఖర్ ఆధ్వర్యంలో హంస వాహనంలో స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. ప్రత్యేక కేరళ చంద్ర మేళం, స్థానిక మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ శేఖర్ మాట్లాడుతూ గురువారం రాత్రి 7.10 గంటలకు స్వామివారి దివ్య కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు భట్రాజు శివాజీ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, దూలం శ్యామ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, జక్కా శివాజీ, లోయ రంగారావు, ములగపాటి అయ్యప్ప రాజు, అగ్నిహోత్రం లక్ష్మి నారాయణ చార్యులు, పోలవరపు శ్రీనివాసరరావు, కొనిజేటి వెంకటేశ్వరరావు, గుర్రం రాంబాబు, కదారి ఝాన్సీరాణి, డి.లక్ష్మి నారాయణ, వేంపాటి విష్ణురావు, తోట మహేష్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, శ్రీదేవి, ముదునూరు మల్లికార్జునరావు, దేవకీ శివకుమార్, గుమ్మళ్లపాడు ఉప సర్పంచ్ కొయ్య గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకన్న బ్రహ్మోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, నాయకులు

గోపవరంలో...

గోపవరంలో జరిగిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకరమణ పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉలిసి వసంత కుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు ఉప్పలపాటి నాగమణి, దుట్టా మణి, నాయకులు ఉలిసి శ్యాంబాబు, పోలవరపు శ్రీనివాసరావు, భట్రాజు శ్రీనివాసరావు, నగపల్లి రమేష్, ఉలిసి శ్రీనివాసరావు, గొల్లేరు నీలకంటేశ్వరరావు, ఎం.వేణు, నీలపాల నాగరాజు, గొల్లేరు సాయి, పడమటి శ్రీను, గంగుల దుర్గ, బుర్ల కాశీ, కృష్ణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి

–డీఎల్‌డీఓ సుబ్బారావు



గుడివాడ టౌన్(నందివాడ): నవరత్నాల పథకాల అమలుపై సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. నందివాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వీసెస్ ప్రజలకు అందడంలో జాప్యం తగదన్నారు. అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వే వేగవంతం చెయ్యాలని ప్రామాణికాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, అన్ని సచివాలయాల ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ ..

నందివాడ మండలం పోలుకొండ గ్రామ సచివాలయంలో డీఎల్‌డీవో కేఎస్ఎస్ సుబ్బారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. పథకాలు అమలుతీరుపై సమీక్షించారు. అన్ని శాఖల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పాల ఉత్పత్తిదారుడికి గోల్డ్ కాయిన్ అందజేత

పామర్రు: కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు పథకం కింద పాలఉత్పత్తిదారుడి వివాహం సందర్భంగా గోల్డు కాయిన్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్ట్ బోర్డు సభ్యులు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. స్థానిక ఒకటో వార్డుకు చెందిన గొరపర్తి సతీష్ పాలుత్పత్తిదారుడు. మిల్క్ సొసైటీలో సభ్యత్వం ఉంది. దీంతో సతీష్ వివాహం సందర్భంగా గోల్డ్‌కాయిన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వివాహం చేసుకున్న దంపతులకు కల్యాణమస్తు పథకం కింద ఇచ్చే గోల్డు కాయిన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పాల శీతల కేంద్రం మేనేజర్ సీహెచ్‌డీకె గోపినాథ్, రూట్ సూపర్‌వైజర్ కైలే రమేష్‌బాబు, వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి, పాల ఉత్పత్తి దారులు గొరిపర్తి నాగబాబు, గొరిపర్తి గోపాలకృష్ణలు పాల్గొన్నారు.



నూతన దంపతులకు గోల్డు కాయిన్ అందజేస్తున్న ట్రస్టుబోర్డు సభ్యుడు కృష్ణారెడ్డి

జగన్నాథుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్ : రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శ్రీసుభద్ర బలరామసహిత శ్రీజగన్నాథస్వామి విగ్రహాలకు పూజలు చేసి, రుక్మిణి సత్యభామలను పెండ్లికుమార్తెలుగా వేణుగోపాలుడిని పెండ్లికుమారునిగా అలంకరించారు. వీరి కల్యాణం గురువారం రాత్రి ఎదుర్కోలు సన్నాహం అనంతరం నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు, చైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి తెలిపారు. ఉత్సవాలు ముగిసేంతవరకు నిత్యం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



పూజలు చేస్తున్న అర్చకులు

ఎంపీపీల సంఘం కార్యవర్గ సభ్యుడిగా రామిశెట్టి



ముదినేపల్లి రూరల్ : రాష్ట్ర ఎంపీపీల సంఘం కార్యవర్గ సభ్యుడిగా ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఎంపికయ్యారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఏలూరులో బుధవారం నిర్వహించినట్టు రామిశెట్టి తెలిపారు. సంఘంలో క్రియాశీలక పాత్ర పోషించి ఎంపీపీల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సహకారంతో మండలాలను అభివృద్ధి పథంలో పయనింపజేసేందుకు తగిన సూచనలు, సలహాలు సంఘానికి అందజేస్తానని తెలిపారు. ఎంపీపీ నియామకంపై వైఎస్సార్ సీపీ మండల నేతలు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, పేర్ని పృథ్వీ, శీలం రామకృష్ణ, పేరే రామకృష్ణ, మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీల సభ్యులు, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్ : అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వలంటీర్ల పోస్టులకు ఎంపికైన వారికి బుధవారం నియామక పత్రాలను అందజేశారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింపజేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించాలని, పారదర్శకంగా అమలు చేసేందుకు సహకరించాలని ఎంపీడీఓ కోరారు. అంకిత భావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పెనుమల్లి ఎంపీటీసీ సభ్యుడు వీరమల్లి కొండలరావు, సొసైటీ అధ్యక్షుడు ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

13న మెగా లోక్ అదాలత్

గుడివాడ టౌన్: రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని 11వ అదనపు జిల్లా జడ్జి (ఇన్‌చార్జ్) ఎస్ చిన్నబాబు కోరారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. కేసుల పరిష్కారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడానికి న్యాయవాదులు, పోలీసులు పరస్పర అవగాహనతో సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ. పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీదేవి, డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల సీఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న 11వ అదనపు జిల్లా జడ్జి చిన్నబాబు

7న ఉచిత మెగా వైద్యశిబిరం

గుడివాడ టౌన్: డాక్టర్ వైఎస్సార్ వైద్య విభాగం, కొతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం, వైఎస్సార్ సీపీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం చైర్మన్ వడ్లమూడి చిన్నా బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. గుడ్లవల్లేరు మండలం కొతవరం గ్రామం కానూరి వారి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, దంత, కంటి, న్యూరాలజి తదితర శాఖల నిపుణులైన వైద్యులు పాల్గొంటారన్నారు. కంటి పరీక్షల అనంతరం కళ్ల సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. గడ్లవల్లేరు మండల వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడ టౌన్: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ది ఫిషర్ మెన్ సొసైటీ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయ గణపతి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శిఖర, కలశ, సహిత, శ్రీ గణపతి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని మత్స్యకార సోదరులు ఇంత వైభవంగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే కొడాలి నానికి సొసైటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, గొర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొడాలి నానికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

పీహెచ్‌సీ పనితీరుపై ఎమ్మెల్యే సమీక్ష

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండల పరిధిలోని వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. పీహెచ్‌సీలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొన్నారు. పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. స్థానిక వైద్యుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పీహెచ్‌సీలో రికార్డులు, సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని, దీని వలన నిధులు సద్వినియోగం అవటం లేదని అన్నారు. ఖర్చులకు తగిన బిల్లులు నమోదు చేయటం లేదన్నారు. కొన్ని టెక్నికల్ సమస్యల కారణంగా ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి తగు విధమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ, ఎంపీడీవో సుధా ప్రవీణ్, లంకపల్లి సర్పంచ్ వేమూరి రత్నకుమారి, వైద్యులు డి.పద్మజ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన

కైకలూరు: స్థానిక ఏలూరు రోడ్ జగనన్న గ్రీన్ విలేజ్ గృహ నిర్మాణాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) బుధవారం పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్మాణాలకు సాయం అందిస్తోందన్నారు. గ్రీన్ విలేజ్‌లో ఇప్పటికే తాగు నీరు, విద్యుత్, రహదారులు సౌకర్యాలు కల్పించామన్నారు. నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు.